మిగిలింది ఐదు రోజులు మాత్రమే..

- మొదట చివరి మున్సిపాలిటీగా ఘట్‌కేసర్
- మరో ఐదు రోజుల్లో ముగియనున్న కౌన్సిల్ గడువు
- వరుసగా రెండేళ్లు జాతీయ అవార్డుకు ఎంపిక
- అవిశ్వాసం ఎదుర్కొన్న చైర్‌పర్సన్
- చైర్‌పర్సన్ పదవిని కాంగ్రెస్‌కు అప్పగించిన బీఆర్ఎస్





స్వచ్ఛ సర్వేక్షన్-2021 అవార్డు అందుకుంటున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య (ఫైల్)

ఘట్‌కేసర్: గ్రామంగా ఉన్న ఘట్‌కేసర్ అక్టోబర్ 17, 2018లో ఘట్‌కేసర్, కొండాపూర్, ఎన్ఎఫ్‌సీనగర్ పంచాయతీతో మున్సిపాలిటీగా ఏర్పడింది. ఎన్నికల తర్వాత జనవరి 27, 2020న మున్సిపాలిటీ మొదటి చైర్ పర్సన్‌గా పావనీ జంగయ్యయాదవ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఓఆర్ఆర్ బయట ఉన్న మాదారం, ఎదులాబాద్, అవుషాపూర్, అంకుషాపూర్, మర్పల్లిగూడ, ఘనాపూర్ పాలకవర్గం పదవీ కాలం ముగిసిన వెంటనే ఫిబ్రవరి 2, 2024న సర్పంచుల పదవీకాలం, జూలై 4, 2024న ఎంపీటీసీల పదవీకాలం ముగియగానే సదరు గ్రామాలను ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో విలీనం చేశారు. జనవరి 26, 2025తో ప్రస్తుత కౌన్సిల్ పదవీకాలం ముగియగానే జీహెచ్ఎంసీ పాలనలోకి వెళ్లనుంది. కౌన్సిల్‌కు మరో ఐదు రోజులు మాత్రమే గడువు ఉండడంతో ఘట్‌కేసర్ మున్సిపాలిటీ మొదటి, చిట్ట చివరిది కానుంది.

అవిశ్వాసం పెట్టిన సొంత పార్టీ నేతలు..

మున్సిపల్ ఎన్నికల్లో 10 మంది బీఆర్ఎస్, నలుగురు కాంగ్రెస్, నలుగురు ఇండిపెండెట్లు విజయం సాధించారు. ఎన్నికల అనంతరం నలుగురు కాంగ్రెస్, ముగ్గురు ఇండిపెండెంట్లు బీఆర్ఎస్‌లో చేరారు. పాలన సజావుగా సాగుతుండగా బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ల మధ్యన మనస్పర్థలు వచ్చి నాలుగేళ్లు పూర్తి కాగానే సొంత పార్టీ కౌన్సిలర్లు చైర్ పర్సన్‌పై అవిశ్వాసం పెట్టారు.

బీఆర్ఎస్ నుంచి చైర్ పర్సన్ కాంగ్రెస్‌లో చేరిక..

2024లో జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం గెలవడంతో సమీకరణాలు మారిపోయాయి. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్ చొరవతో ఎమ్మెల్యే ఎన్నికలకు ముందే ఆరుగురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. అదే సమయంలో అవిశ్వాసం తెరపైకి రావడంతో ఇద్దరు అధికార పార్టీ కౌన్సిలర్ల సహకారంతో చైర్ పర్సన్ గట్టెక్కారు. బీఆర్ఎస్‌లో ఉన్న చైర్ పర్సన్‌పై సొంత పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టడం, ఎమ్మెల్యే అప్పటి మంత్రి చామకూర మల్లారెడ్డి నోరు విప్పకపోవడంతో కలత చెంది అవిశ్వాసం నెగ్గిన క్షణాల్లోపే బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. దీంతో బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టి చైర్ పర్సన్ పదవిని కాంగ్రెస్‌కు అప్పగించినట్లు అయింది.

వరుసగా రెండు సార్లు జాతీయ అవార్డులు..

లక్ష కంటే తక్కువ జనాభా ఉన్న పట్టణాలకు కేంద్రం ''స్వచ్ఛ సర్వేక్షన్''లో భాగంగా పట్టణ సుందరీకరణ, బహిరంగ మలమూత్ర విసర్జన నిషేధం, ప్లాస్టిక్ నిషేధం, చెత్త సేకరణ, పట్టణ ప్రగతిలో మార్కులు కేటాయించింది. ప్రతిభ ఆధారంగా వరుసగా 2021, 2022 స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డుకు ఎంపికై చైర్ పర్సన్ పావనీజంగయ్య ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో అవార్డు స్వీకరించారు.

అందరి సహకారంతో అవార్డులు గెలుచుకున్నాం..



మున్సిపాలిటీని సమదృష్టితో అభివృద్ధి చేశాం. కౌన్సిల్ సభ్యులు, పారిశుధ్య కార్మికులు, మున్సిపల్ ప్రజల సహకారంతో రెండు సార్లు జాతీయ అవార్డులు గెలుచుకున్నాం. ఐదేళ్ల పాటు అభివృద్ధికి సహకరించిన అందరికి ధన్యవాదాలు.

– పావనీజంగయ్యయాదవ్, చైర్ పర్సన్

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: అత్వెల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా నేడు పలు గ్రామాలలో కరెంట్ సరఫరా ఉండదని రూరల్ ఏఈ మౌలాలి తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని రావల్‌కోల్ పరిధిలో అన్నీ వ్యవసాయ కనెక్షన్లకు, పరిశ్రమలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని తెలిపారు.

సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీజేపీ నాయకుడు రమేష్‌రెడ్డి కోరారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని బాబుల్‌రెడ్డినగర్‌లోని మూడు అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలతో కలిసి కేక్‌కట్ చేసి పిల్లలకు పంపిణీ చేశారు. అలాగే అంగన్‌వాడీ టీచర్లకు, జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులకు హాట్ బాక్సులు, పిల్లలకు పలకలు, స్టేషనరీ సామాగ్రీ అందజేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్, వీరేష్, శంకర్, మురళీ, కిరణ్, రోహిత్, సెంట్రింగ్ శంకర్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

రూ.20 లక్షలతో సీసీరోడ్డు పనులు

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ విష్ణుపురికాలనీలో రూ.20 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ శ్రవణ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. విష్ణుపురికాలనీలో భజరంగ్ కిరాణా దుకాణం నుంచి నర్సింహారెడ్డినగర్ రైల్వేట్రాక్ వరకు నూతనంగా బాక్స్‌డ్రైన్ నిర్మాణం చేపట్టామన్నారు. ప్రదీప్, నాని, చారి, మౌనిష్, రాజేష్, రవి, కొండల్ పాల్గొన్నారు.

మెట్రో వర్క్‌షాప్ ఏర్పాటు చేయాలని వినతి



మెట్రో ఎండీతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మేడ్చల్: రెండవ ఫేజ్‌లో భాగంగా ప్రభుత్వం మేడ్చల్, షామీర్‌పేట్ వరకు నిర్మిస్తున్న మెట్రో రైల్ వర్క్ షాప్‌ను మేడ్చల్‌లో ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు మెట్రో ఎండీ ఎన్‌వీఎస్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు నాయకులు మెట్రో ఎండిని కలిసి వినతి పత్రం అందజేశారు. మెట్రోను జిల్లా సరిహద్దు డబీల్‌పూర్ వరకు విస్తరించాలని, వర్క్ షాపును మేడ్చల్ పరిసర ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, అవినాష్‌చారి, నరేందర్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడాపోటీలు



క్రీడలను ప్రారంభిస్తున్న కరస్పాండెంట్ కృష్ణారెడ్డి

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం, జగ్గంగూడలోని జీనియస్ గ్రామర్ హై స్కూల్‌లో వార్షిక క్రీడా పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను స్కూల్ కరస్పాండెంట్ కృష్ణారెడ్డి ప్రారంభించారు. 3 రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో లాంగ్ జంప్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర క్రీడా పోటీలు నిర్వహించనున్నామని, ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి గణతంత్ర దినోత్సవ వేడుకల్లో బహుమతులను అందజేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కల్పనరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఆంటోనీ, పీఈటీ గౌతమ్, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న చైర్ పర్సన్, కౌన్సిలర్ తదితరులు

మేడ్చల్: పట్టణంలోని 21వ వార్డులో వివిధ అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి కౌన్సిలర్ కృష్ణవేణి రవీందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. వార్డులో నిర్మించిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఐదేళ్లుగా 21వ వార్డును అభివృద్ధి బాటలో నడిపించామని కౌన్సిలర్ అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ నాగిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ ప్రారంభం



కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని న్యూ హనుమాన్‌నగర్ కాలనీలో మున్సిపల్ సాధారణ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ. 18.50 లక్షలు ఖర్చు చేశామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ భాస్కర్‌రెడ్డి, 17 వార్డు కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎంపీ ఈటలను కలిసిన బీజేపీ నాయకులు



మేడ్చల్‌రూరల్: మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను మంగళవారం గుండ్లపోచంపల్లి మున్సిపల్ బీజేపీ నాయకులు కలిశారు. మున్సిపల్ బీజేపీ నూతన అధ్యక్షులుగా కావేరి శ్రీధర్ ఎన్నిక కావడంతో పాటు నూతన కమిటీని నియమించడంతో పూడూర్‌లోని ఈటల నివాసంలో ఎంపీని కలిసి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు విక్రంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు మల్లిఖార్జున్ ముదిరాజ్, సరస్వతి, హంసరాణి, నాయకులు రవీందర్‌గౌడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా గ్రామ సభలు



అలియాబాద్‌లో అధికారులతో వాగ్వాదం చేస్తున్న గ్రామస్తులు

శామీర్‌పేట్: ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన గ్రామ సభలు రసాభాసగా మారాయి. రేషన్ కార్డుల జాబిత, ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తు, రైతు భరోసా తదితర పథకాల పై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు మంగళవారం ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని అలియాబాద్, జగ్గంగూడ, లక్ష్మాపూర్ గ్రామాల్లో నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల లబ్ధిదారుల జాబితాను అధికారులు ప్రదర్శించారు. అర్హులైన నిరుపేదలకు పథకాలు మంజూరు కాలేదంటూ అధికారులతో గ్రామస్తులు వాగ్వాదానికి దిగారు. దీంతో సభలు గందరగోళంగా మారాయి. ప్రభుత్వం, ఉన్నతాధికారులు చొరవ తీసుకొని నిజమైన నిరుపేదలకు పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, స్థానిక నాయకులు డిమాండ్ చేశారు.

గట్టమ్మ ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య, ఈఓ భాగ్యలక్ష్మి

ఘట్‌కేసర్: శ్రీ గట్టుమైసమ్మ అమ్మవారి జాతర హుండీ లెక్కింపు ఆలయం ఆవరణలో మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, ఈఓ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో లెక్కించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన వివిధ హుండీల ద్వారా రూ. 2,23,298ల ఆదాయం వచ్చిందని తెలిపారు. కాగ గతేడాది రూ. 2,12,180ల ఆదాయం వచ్చిందన్నారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ.. జాతర విజయవంతం చేసినందుకు పోలీసులు, మున్సిపల్ సిబ్బంది, రెవెన్యూ, ఆరోగ్యశాఖ, విద్యుత్‌శాఖ, నేషనల్ హైవే అధికారులు, ప్రజా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆంజనేయులు గౌడ్, నర్సింగ్‌రావు, వెంకట్‌రెడ్డి, నాయకులు ముత్యాలుయాదవ్, రాధాకృష్ణ ముదిరాజ్, జంగయ్యయాదవ్, ప్రభాకర్‌రెడ్డి, జంగారెడ్డి, ప్రసాద్, దేవదాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మల్లిఖార్జునస్వామి జాతర



మల్లిఖార్జున స్వామిని దర్శించుకుంటున్న మల్లారెడ్డి, తదితరులు



ఒగ్గు కళాకారులతో డోలు వాయిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం, కేశవరం గ్రామంలో భ్రమరాంబికా మల్లిఖార్జున స్వామి జాతర మంగళవారం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద ఎమ్మెల్యే మల్లారెడ్డి ఒగ్గు కళాకారులతో కలిసి డోలు వాయించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

రైతు భరోసా వదులుకున్న మహిళా రైతు



గ్రామ సభలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

కీసర: కీసర మండలం రాంపల్లిదాయరలో ఓ మహిళ ప్రభుత్వం ఇస్తున్న రైతు భరోసా సాయాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నారు. మంగళవారం గ్రామంలో జరిగిన ప్రజాపాలన సభలో కందాడి సుశీల తన కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్న 7 ఎకరాలకు ప్రభుత్వం అందజేస్తున్న రైతు భరోసాను, తనకున్న తెల్ల రేషన్ కార్డును స్వచ్ఛందంగా వదులుకున్నారు. జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సమక్షంలో ఆమె తన నిర్ణయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ..సుశీల స్ఫూర్తితో ఆర్థికంగా అభివృద్ధి చెందినవారు స్వచ్ఛందంగా రైతు భరోసా వదులుకోవాలని సూచించారు.

బీజేపీ గెలుపే లక్ష్యం



పట్టణ బీజేపీ నాయకులను సన్మానిస్తున్న మండల నాయకులు

మేడ్చల్: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మేడ్చల్ మండలంలోని అన్ని గ్రామాలలో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నామని మేడ్చల్ మండల బీజేపీ నూతన అధ్యక్షుడు శ్రీశైలంయాదవ్ అన్నారు. పట్టణ బీజేపీ నూతన అధ్యక్షురాలు శైలజ, మాజీ అధ్యక్షుడు ఆంజనేయులు, మండల మాజీ అధ్యక్షుడు నరేందర్ రెడ్డిలను ఆయన మండల నాయకులతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పార్టీని అన్ని గ్రామాల్లో బలోపేతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, రాఘవరెడ్డి, అర్జున్, భిక్షపతి, వంశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియామకం



శ్రవణ్‌కుమార్ గుప్తా

మేడ్చల్: మేడ్చల్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వీరమల్ల శ్రవణ్‌కుమార్‌గుప్తా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర సంఘం శ్రవణ్‌కుమార్‌ను మండల సంఘం అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లికి చెందిన శ్రవణ్‌కుమార్ మండల రాజకీయాల్లో సీనియర్ నాయకుడిగా వ్యవహరిస్తున్నారు. ఆయన సతీమణి మానస 1వ వార్డు కౌన్సిలర్‌గా ఉన్నారు. మేడ్చల్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా చంద్రమౌళి నియమితులయ్యారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రగతినగర్ కాలనీవాసులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లో డ్రైనేజీ, సీసీరోడ్లు, వీధిలైట్లు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కాలనీ అధ్యక్షులు బాల్‌నర్సింహ ఆధ్వర్యంలో కమిషనర్ డాకు నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. కాలనీలో వ్యర్థాలు పారవేయడంతో అపరిశుభ్రంగా మారి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, వెంటనే సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ప్రకాష్, కాలనీవాసులు కుమారస్వామి, గణేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 1.86 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం



సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి మంగళవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్ఐజీ కాలనీ, రాజీవ్ గృహకల్ప, యంనంపేట్, ఇస్మాయిల్‌ఖాన్‌గూడ ప్రాంతాల్లో సుమారు రూ. 1.86 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. దీంతో పాటు రూ. 1.66 కోట్లతో పూర్తి చేసిన అభివృద్ధి పనులను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ వీరారెడ్డి, కౌన్సిలర్లు మహేష్, సాయిరెడ్డి, రాజశేఖర్, పోచమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ పరిశీలన



సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి విజయకుమారి

కీసర: చీర్యాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని జిల్లా విద్యాశాఖాధికారి విజయకుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మెరుగైన ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు విశేషంగా కృషి చేయాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం ప్రక్రియను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ శశిధర్, జీహెచ్ఎం రవీందర్, ఎమ్ఎన్ఓ జమదగ్ని, ఉపాధ్యాయులు శ్రీధర్, శరత్, మోహన్ బాబు, శైలజ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



సభలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ దీపికరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ శాంతి



కీసర వార్డు సభలో అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

మేడ్చల్: పేదల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లోని సంక్షేమ పథకాలన్నీ అర్హులైన అందరికీ అందుతాయని మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి అన్నారు. ప్రజాపాలనలో భాగంగా పట్టణంలోని 2,21 వార్డులలో నిర్వహించిన వార్డు సభలలో ఆమె పాల్గొని సభలను ప్రారంభించారు. ప్రభుత్వం రేషన్ కార్డుల లబ్ధిదారుల ఎంపిక, రైతు భరోసా, రైతు భీమాకు ఎంపికైన లబ్ధిదారుల జాబిత విడుదల చేశారు. రేషన్ కార్డులు అర్హులైన అందరికీ వస్తాయని, రాని వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కౌన్సిల్ చూస్తుందన్నారు. పట్టణంలోని అన్నీ వార్డులలో నిర్వహించే సభలకు ఆయా వార్డుల ప్రజలు తమకు కేటాయించిన తేదిలలో హాజరు కావాలని కోరారు. సభలలో కౌన్సిలర్లు సరితా మల్లేష్‌గౌడ్, కృష్ణవేణి రవీందర్‌రెడ్డి, కమిషనర్ నాగిరెడ్డి, డీఈ విజయలక్ష్మీ, టీపీఎస్ రాధాకృష్ణరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్: ప్రజాపాలనలో భాగంగా జవహర్‌నగర్ కార్పొరేషన్ మేయర్ శాంతి ఆధ్వర్యంలో 1 నుంచి 8 వార్డుల్లో మంగళవారం వార్డు సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజాపాలనలో భాగంగా అర్హులైన వారికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అర్హులందరికి అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, మేనేజర్ నగేష్, కార్పొరేటర్లు రవి, రాజ్‌కుమార్, రోజాశ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ఎల్‌నగర్‌లో నిర్వహించిన ప్రజాపాలన వార్డు సభను మేడ్చల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాధికా గుప్తా మంగళవారం పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు.

సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోండి

ఘట్‌కేసర్: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. మున్సిపాలిటీలోని 1, 2, 4వ వార్డులో మంగళవారం ప్రజాపాలన వార్డు సభలు నిర్వహించారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం ఆధార్ అందజేయాలన్నారు. ఈ నెల 26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాతో పాటు ఇతర నాలుగు పథకాలకు ప్రభుత్వం స్వీకారం చుడుతోందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, రమాదేవి, ఆంజనేయులుగౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య